కలెక్టర్‌తో ట్రైనీ ఐఎఎస్‌ల బృందం సమావేశం

ఏలూరు: ట్రైనీ ఐఎఎస్‌ల బృందం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌తో శనివారం మర్యాదపూర్వకంగా సమావేశమైంది. తమ శిక్షణలో భాగంగా క్షేత్రస్థాయిలో వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలు తీరు పరిశీలన కోసం శనివారం జిల్లాకు చేరుకున్న 10 మంది ట్రైనీ ఐఎఎస్‌లు కలెక్టర్ బంగ్లాలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌తో సమావేశమయ్యారు. బి.సాహిత్‌రాజ్, బి.సహదిత్‌వెంకట్ త్రివినాగ్, సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి, కెఆర్.కల్పశ్రీ, కుషాల్ జైన్, ఎం.మౌర్యభరద్వాజ్, రాఘవేంద్రమీనా, సౌర్యమాన్ పటేల్, తిరుమని శ్రీపూజ, వి.సంజనసింహ ఈ బందంలో ఉన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ క్షేత్రస్థాయి పర్యటనలు, గ్రామీణ స్థితిగతుల అధ్యయనంతో పూర్తిస్థాయి అవగాహన కలుగుతుందని, అప్పుడే ప్రజలకు సమర్థవంతమైన పరిపాలనా సేవలు అందించగలుగుతారని అన్నారు. రెవెన్యూ అంశాలు, భూరికార్డులు, పరిపాలన తదితర అంశాలను క్లుప్తంగా వారికి వివరించారు. అనంతరం ట్రైనీ ఐఎఎస్‌లు పోలవరం ప్రాజెక్టు సందర్శనకు బయలుదేరి వెళ్లారు.

పోలీస్ విధులేస్తే

కఠిన చర్యలే..!

మహిళా పోలీసుల విధులపై పోలీస్ అధికారులకు ఎస్‌పిలు స్పష్టమైన ఆదేశాలు

బందోబస్తు, రిసెప్షన్, శాంతిభద్రతల విధులు అప్పగించొద్దని స్పష్టం

తరచూ పోలీస్ స్టేషన్‌కు పిలిపిస్తే చర్యలే

ఎట్టకేలకు ఫలించిన మహిళా పోలీసుల జాబ్‌చార్ట్ పోరు

క్షేత్రస్థాయిలో అమలుపై అనుమానాలు వెల్లువ

నిబంధనలు ఒకటి.. విధులు మరొకటి..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులకు (మహిళా పోలీసులు) పోలీస్‌స్టేషన్‌లో విధులు కేటాయిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని డిజిపి ఆదేశాల మేరకు జిల్లా ఎస్‌పిలు స్పష్టంగా కిందిస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. బందోబస్తు, రిసెప్షన్, శాంతిభద్రతలు వంటి పనులకు మహిళా పోలీసులను వినియోగించడం, తరచూ పోలీస్ స్టేషన్‌కు పిలిపించడం వంటివి చేయకూడదని తమ ఆదేశాల్లో పేర్కొన్నారు. దీంతో మహిళా పోలీసుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. మహిళా పోలీసులకు సంబంధించిన జాబ్‌ఛార్ట్ అమలు చేయాలని ఎప్పటి నుంచో ఉద్యోగులు న్యాయ పోరాటం చేస్తున్నారు. ఎట్టకేలకు మహిళా పోలీసుల పోరు ఫలించింది. మహిళా పోలీసులకు పోలీస్ విధులు కేటాయించబోమని రాష్ట్ర డిజిపినే స్పష్టం చేశారు. మహిళా పోలీసులకు సంబంధించిన జాబ్‌ఛార్ట్ వివాదంపై ఒకసారి పరిశీలిస్తే వారు చేసిన పోరాటం, సాధించిన గెలుపు గురించి ఎంత చెప్పినా తక్కువే అనిపిస్తోంది. వైసిపి ప్రభుత్వం వచ్చాక గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టింది. ఈ సచివాలయాల్లో 11 శాఖలకు సంబంధించిన ఉద్యోగులను నియమించింది. దీనిలో డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్, ఫిషరీస్ అసిస్టెంట్, సర్వేయర్ వంటి పోస్టులతోపాటు గ్రామంలో మహిళల రక్షణకు సంబంధించి గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శుల ఉద్యోగులను నియమించింది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 900కుపైగా గ్రామసచివాయాలు ఏర్పాటవ్వగా ప్రతి సచివాలయంలోనూ గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు నియమితులయ్యారు. వీరినే మహిళా పోలీసులగా పిలుస్తున్న పరిస్థితి ఉంది. మహిళా పోలీసులకు సంబంధించిన విధుల గురించి ఉద్యోగ నియామకాల సందర్భంగా ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. గ్రామ సచివాలయ పరిధిలో నేరాలకు సంబంధించిన సమాచారం పోలీస్‌స్టేషన్లకు ఇవ్వడం, మహిళలకు సంబంధించిన కేసులు సచివాలయ పరిధిలో జరిగితే హాజరుకావడం, సచివాలయ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించడం, ప్రభుత్వ స్కూళ్లకు వెళ్లి చట్టాలపై అవగాహన కల్పించడం, గ్రామస్తులకు చట్టాల గురించి తెలియజేయడం వంటి విధులను నిర్వర్తించాల్సి ఉంది. అయితే మహిళా పోలీసులకు అందుకు విరుద్ధంగా విధులు కేటాయిస్తున్న పరిస్థితి ఉంది.

మహిళా పోలీసులకు ప్రభుత్వం చెప్పిన జాబ్‌ఛార్ట్‌ను పూర్తిగా పక్కన పెట్టేశారు. వీరికి పూర్తిగా పోలీస్‌శాఖలో పనులు అప్పగించడం ప్రారంభించారు. సిఎం, విఐపిల పర్యటనలకు గ్రామాల్లో జాతరలు వంటి కార్యక్రమాలు జరిగితే బందోబస్తులకు, ఎస్‌ఐ, కానిస్టేబుల్ వంటి పరీక్షలు, పదోతరగతి, ఇంటర్ పరీక్షల కేంద్రాల వద్ద బందోబస్తులకు, రాత్రి 12 గంటల వరకూ డ్యూటీలు వేయడం వంటివి చేస్తున్నారు. గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులను మహిళా పోలీసులుగా పేర్కొంటూ ప్రభుత్వం జిఒ జారీ చేయగా దీనిపై కొంతమంది ఉద్యోగులు కోర్టుకు వెళ్లారు. దీంతో ఆ జిఒను రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం కోర్టులో తెలిపినప్పటికీ విధుల కేటాయింపు మాత్రం క్షేత్రస్థాయిలో ఆగలేదు. దీంతో మహిళా పోలీసులు తీవ్ర ఇబ్బందులు పడుతూ విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొంతమంది సిఐలు, ఎస్‌ఐలు కానిస్టేబుళ్లు ఉన్నా మహిళా పోలీసులకే విధులు కేటాయించడం, వినకపోతే మెమోలు వంటివి జారీ చేస్తూ వేధింపులకు గురిచేయడం వంటి ఘటనలు నిత్యకృత్యంగా మారాయి. దీనిపై మహిళా పోలీసులు అలుపెరగని పోరాటం చేస్తూనే ఉన్నారు. కోర్టు విచారణ సందర్భంగా మహిళా పోలీసులకు పోలీస్ విధులు కేటాయించబోమని ప్రభుత్వం తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. డిజిపి ఆదేశాలు జారీ చేస్తారని పేర్కొన్నారు. అందులో భాగంగా శుక్రవారం మహిళా పోలీసులకు సంబంధించి పోలీస్ విధులు కేటాయించొద్దని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవంటూ డిజిపి జిల్లా ఎస్‌పిలకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో శనివారం రెండు జిల్లాల ఎస్‌పిలు కిందిస్థాయి సిబ్బందికి మహిళా పోలీసులకు పోలీస్ విధులు కేటాయించొద్దంటూ స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

క్షేత్రస్థాయిలో అమలుపై అనుమానాలే

మహిళా పోలీసులకు పోలీస్ విధులు కేటాయించొద్దని పోలీస్ ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చినప్పటికీ క్షేత్రస్థాయిలో అమలుపై పలు అనుమానాలు నెలకొన్నాయి. సిఐ, ఎస్‌ఐలు ఈ ఆదేశాలను పక్కాగా అమలు చేస్తారా అనే సందేహాలు అలముకున్నాయి. మహిళా పోలీసులను బెదిరించి, సమీక్షల పేరుతో స్టేషన్‌కు పిలిపించి పనులు చేయించుకునే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా మహిళా పోలీసులు తమ జాబ్‌ఛార్ట్ ప్రకారం పనిచేస్తారా, మళ్లీ పోలీస్ అధికారుల బెదిరింపులకు భయపడి తలొగ్గుతారా అనేది వేచిచూడాలి.

పట్టిసీమ వద్ద గోదావరి వరద ఉధృతి

గోదావరి తగ్గుముఖం

ముంపులోనే రహదారులు

ప్రజాశక్తి - కుక్కునూరు

నాలుగు రోజులుగా వరద పోటెత్తి పెరుగుతూ వచ్చిన గోదావరి శనివారం తగ్గుముఖం పట్టింది. భద్రాచలంలో మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించారు. భద్రాచలంలోగోదావరి నీటిమట్టం 39.7 అడుగులకు తగ్గినా ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటం, ప్రాజెక్టులలో ఉన్న నీటిని దిగువకు వదులుతుండటంతో మళ్లీ వరద పెరుగుతుందని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించడంతో ముంపు మండలాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికీ ముంపు రోజులుగా కుక్కునూరు-దాచారం మధ్య కాజ్‌వేను వరద ముంచెత్తడంతో 14 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గొమ్ముగూడెంకి చెందిన 253 కుటుంబాలు, వేలేరుపాడు మండలానికి చెందిన 180 కుటుంబాలను రావికంటి పునరావాస కేంద్రానికి తరలించి వారికి అవసరమైన నిత్యావసర సరుకులిచ్చి అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తహశీల్దార్ ప్రమద్వర తెలిపారు.

కుక్కునూరు- దాచారం మధ్య గుండేటి వాగుపై ఉన్న కాజ్‌వేను ముంచెత్తిన గోదావరి వరద

48 వైద్య శిబిరాల నిర్వహణ

అసిస్టెంట్ కలెక్టర్ అపూర్వ భరత్

వేలేరుపాడు: ముంపు గ్రామాల ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించడానికి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ముంపు ప్రాంతాల్లో 48 వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు అసిస్టెంట్ కలెక్టర్ అపూర్వ భరత్ తెలిపారు. శనివారం ఆయన ఆర్‌డిఒ ఝాన్సీరాణితో కలిసి కోయిదా పిహెచ్‌సిని పరిశీలించారు. మందుల స్టాక్ వివరాలను తెలుసుకున్నారు. సివిల్ సప్లయీస్ స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేశారు. పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నార్లవరం, తూర్పుమెట్ట, చిగురుమామిడి, కట్కూరు, టేకూరు, కాసారం గ్రామాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ వైద్య శిబిరాల్లో అన్నివేళలా డాక్టర్లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు వైద్య సేవలు అందించడానికి 108 వాహనాలు సిద్ధం చేశామని తెలిపారు. 27 మంది గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. మండలంలోని ఎర్రబోరుకు చెందిన గర్భిణి గొండ్ మంగతాయారు వరద కారణంగా వేలేరుపాడు పిహెచ్‌సికి తరలించగా శుక్రవారం ఆరోగ్యవంతమైన పాపను ప్రసవించినట్లు తెలిపారు.

పోలవరం ప్రాజెక్టు నుండి 6,44,857 క్యూసెక్కుల నీరు విడుదల

పోలవరం: పోలవరం ప్రాజెక్టులో గోదావరి నీటిమట్టం తగ్గుముఖం పట్టింది. పోలవరం ప్రాజెక్టు నుండి 6,44,857 క్యూసెక్కుల వరద జలాలను దిగువకు విడుదల చేసినట్లు ఇఇ పి.వెంకటరమణ తెలిపారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 32.040 మీటర్ల నీటిమట్టం, దిగువన 23.540 మీటర్ల నీటిమట్టం, ఎగువ కాపర్ డ్యామ్ వద్ద 32.790 మీటర్లు, దిగువ కాపర్ డ్యామ్ వద్ద 23.140 మీటర్ల నీటిమట్టం నమోదైంది. పోలవరంలో గోదావరి నీటిమట్టం 22.577 మీటర్లకు తగ్గింది.

సెల్‌టవర్లకు జనరేటర్లు సిద్ధం

ఎపిఇపిడిసిఎల్ ఎస్‌ఇ సాల్మన్‌రాజ్

కుక్కునూరు: గోదావరి వరదల దృష్ట్యా కలెక్టర్ ఆదేశాల మేరకు సెల్‌టవర్లకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు జనరేటర్లు సిద్ధం చేశామని ఎపిఇపిడిసిఎల్ ఎస్‌ఇ సాల్మన్‌రాజ్ తెలిపారు. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో విద్యుత్ సరఫరా అన్ని సెల్ టవర్లకు ప్రస్తుతం అందుబాటులో ఉందన్నారు. ముందు జాగ్రత్తచర్యగా ప్రధాన గ్రామాలైన కొయిదా, టేకూరు గ్రామాల్లో రెండు 7.5 కెవి జనరేటర్లు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. కొయిదా, కుక్కునూరు ఫీడర్లకు ప్రత్యామ్నాయంగా మరో విద్యుత్ లైనుకు ప్రతిపాదించామని, వాటి పనులు ప్రారంభించామని తెలిపారు.

ఏలూరులో నిరసన తెలుపుతున్న ఐద్వా నాయకులు

‘మణిపూర్’ దోషులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మణిపూర్ అల్లర్లలో మహిళలను నగ్నంగా ఊరేగించి అమానుషంగా ప్రవర్తించిన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కన్వీనర్ పి.హైమావతి, నేత జె.హరీషాదుర్గ మాట్లాడుతూ అందరూ తలదించుకునేలా అత్యంత పాశవికంగా మణిపూర్‌లో మతోన్మాద మూకలు మహిళలను నగ్నంగా ఊరేగించడాన్ని తీవ్రంగా ఖండించారు. 78 రోజులుగా ఆ రాష్ట్రంలో అల్లర్లు జరుగుతుంటే కేంద్రం, రాష్ట్రంలోనూ అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం పట్టించుకోకుండా వ్యవహరించిందని విమర్శించారు. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని తొలగించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలకు ఎవరూ పాల్పడకుండా ఉండేలా కఠిన చర్యలు చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు గాళ్ల శారద, బి.జయలక్ష్మి, టి.రజిని, టి.సుకన్య, స్వర్ణలత, హేమ, ఆంథోనమ్మ, వెంకమ్మ, సిఐటియు నాయకులు పి.కిషోర్, ఎం.శ్రీనివాసరావు, బి.జగన్నాధరావు, జి.సురేష్ పాల్గొన్నారు.

నూజివీడు : మణిపూర్‌లో ఘోరకలిని నిరసిస్తూ స్థానిక చిన్న గాంధీ బొమ్మ సెంటర్ లో సిఐటియు, ఐద్వా, యుటిఎఫ్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు నేతలు జి.రాజు, ఎన్ఆర్.హనుమనులు, ఐద్వా నేతలు నండూరి పద్మాంజలి, పుట్టి కమల, యుటిఎఫ్ నాయకులు జి.వెంకటేశ్వరరావు, మార్ష ప్రజాసంఘాల నేతలు దుర్గారావు, నాగమణి, రాధాకుమారి, నాగలక్ష్మి, పావని, కుమారి, అనూరాధ, రమ, విజయ, వసంతరావు, శోభనాద్రి, రామకృష్ణ పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : మణిపూర్‌లో హింసాత్మక ఘటనలకు నిరసనగా సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, ప్రజాసంఘాల ఆధ్వర్యాన నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్లో ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు కారం రాఘవ అధ్యక్షతన జరిగిన సభలో అఖిలభారత రైతుకూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పోరండ్ల శ్రీనివాస్, ఐఎఫ్‌టియు రాష్ట్ర కోశాధికారి కెవి.రమణ, రాష్ట్ర నాయకులు ఎస్.రామ్మోహన్, ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు వెట్టి సుబ్బన్న, పిఒడబ్ల్యు జిల్లా నాయకులు వెట్టి భారతి, కారం లక్ష్మి, పివైఎల్ నాయకులు తగరం బాబురావు, కె.పోతురెడ్డి, పౌర హక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు భాషా శ్యాంబాబు, పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షుడు వినోద్ మాట్లాడారు.

పోలవరం : మణిపూర్ ఘటనలకు కారకులైన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏజెన్సీ గిరిజన సంఘం, ఎపి రైతు కూలీ సంఘం ఆధ్వర్యాన నిరసన ర్యాలీ నిర్వహించారు. ఏటిగట్టు సెంటర్ వద్ద నిరసన ర్యాలీ, కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నేతలు కుంజం రామారావు, షేక్ భాషా, మాట్లాడగా సవలం రాంబాబు, మిడియం రవి దొర నాయకత్వం వహించారు.

పిహెచ్‌సిలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి పిహెచ్‌సిలో శనివారం విజిలెన్స్ ఎస్ఐ రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. తొలుత ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. అనంతరం సిబ్బంది హాజరు శాతాన్ని పరిశీలించినట్లు తెలిపారు. ఆసుపత్రిలోని పలు స్టాక్ రికార్డులను, గర్భిణులకు సంబంధించి నమోదు చేసిన రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఇచ్చే మందుల వివరాలు సక్రమంగా నమోదు చేస్తున్నారా, లేదా అని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రంజిత్‌కుమార్ మాట్లాడుతూ రికార్డులన్నీ సక్రమంగా ఉన్నాయన్నారు. నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ సిబ్బంది అనిల్, ప్రసాద్ పాల్గొన్నారు.

30న విజయవాడలో కర్షక, కార్మిక రాష్ట్ర సదస్సు

పోస్టర్ ఆవిష్కరించిన నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రైతాంగ సమస్యలపై ఈ నెల 30న విజయవాడలో తలపెట్టిన కర్షక, కార్మిక రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని రైతు, వ్యవసాయ కార్మిక, కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో కర్షక, కార్మిక రాష్ట్ర సదస్సు ప్రచార పోస్టర్లను విడుదల చేశారు. ఏపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఎఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి ధర్మల సురేష్, జిల్లా సహాయ కార్యదర్శి పోరంకి శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కన్వీనర్ ఆర్.లక్ష్మణరావు, ఎఐకెఎస్ రాష్ట్ర అధ్యక్షులు బి.రంగనాథ్, రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) జిల్లా కార్యదర్శి ఎస్.కె.భాషా, బికెఎంయు జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహన్‌రావు, అఖిల భారత వ్యవసాయ కార్మిక సమాఖ్య నాయకులు శ్రావణంపల్లి నాగరాజు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కె.రమణ, ఎపి కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.కృష్ణ, ఆంధ్రప్రదేశ్ కౌలురైతు సంఘం జిల్లా కన్వీనర్ కె.అప్పారావు, చేతివృత్తిదారుల జిల్లా కన్వీనర్ పి.ఆదిశేషు, పిఒడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు వెట్టి భారతి, శ్రామిక మహిళ జిల్లా నాయకులు కె.విజయలక్ష్మి మాట్లాడారు. రైతాంగానికి కేంద్రం ఇచ్చిన హామీల అమలు కోసం రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పక్షాలుగా ఉన్న వైసిపి, టిడిపి, జనసేన కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి రైతాంగ ఉద్యమాన్ని బలపర్చాలని కోరారు.

పునరావాసం కల్పించకే ప్రజలకు పాట్లు : సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ఏలూరు: ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించి పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం పూర్తిగా కల్పించనందువల్లే గోదావరి వరదలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శించారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పునరావాసం, పరిహారాన్ని పూర్తిగా చెల్లించి అక్కడి ప్రజలను పునరావాస కాలనీలకు తరలించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గోదావరికి వరద వచ్చినప్పుడల్లా పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత గ్రామాలు ముంపునకు గురై ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారని పేర్కొన్నారు. గత సంవత్సరం వచ్చిన వరదలకు ఇంత వరకు పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించలేదని, ఇప్పుడు మళ్లీ వరదలతో ముంపు గ్రామాల ప్రజలు నష్టపోతారని పేర్కొన్నారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు చెందిన 6941 కుటుంబాలకు నష్టపరిహారం అందాల్సి ఉందని తెలిపారు. జిల్లా కలెక్టరే గత సంవత్సరం వరద నష్టపరిహారం ఒక్క వేలేరుపాడు మండలంలోనే ఇంకా వెయ్యి మందికిపైగా ఇవ్వాల్సి ఉందని ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కుక్కునూరులో కూడా వందల మందికి బకాయిలున్నాయని పేర్కొన్నారు. గ్రామాలను ఖాళీ చేయించేటప్పుడు సామగ్రి తరలింపు విషయంలో ప్రభుత్వమే వాహనాలు ఏర్పాటు చేసి నిర్వాసితులను పునరావాస కేంద్రాలకు తరలించాలని, లేదా తరలింపునకు అయ్యే రవాణా ఖర్చులైనా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సంవత్సరం వరదల వల్ల ఇప్పటికే కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో కలిపి దాదాపుగా 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయని, ఆ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గ్రామాల ప్రజల మౌలిక అవసరాలను తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. వారు కొండలు, గుట్టలపై నివాసం ఉంటున్నారని, అందుకు వారికి గుడారాలు ఏర్పాటు చేయాలని, నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని, కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలు, సరిపడా తాగునీరు ఏర్పాటు చేయాలని కోరారు. గత సంవత్సరం వరదల సందర్భంగా రేషన్ కార్డుపై ఒక మంచినీటి ప్యాకెట్ ఇచ్చారని, ఇది అమానుషమని, ఈ సంవత్సరమైనా వరద బాధితులకు సరిపడా తాగునీరు ఏర్పాటు చేయాలని కోరారు. ముంపు గ్రామాల ప్రజలకు చట్టబద్ధంగా అందించాల్సిన నష్టపరిహారాన్ని పూర్తిస్థాయిలో అందించి, పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించి నిర్వాసితులను తరలించడం ద్వారానే గోదావరి వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమస్య పరిష్కారానికి పూనుకోవాలని డిమాండ్ చేశారు.

రాజకీయాల్లోకి వట్టి వారసుడు

ఉంగుటూరు అసెంబ్లీ సీటుపై కన్ను - అనుచరులను కలుస్తున్న వట్టి పవన్

ప్రజాశక్తి - ఉంగుటూరు

సార్వత్రిక ఎన్నికలు రాకుండానే ఉంగుటూరు రాజకీయం వేడెక్కుతోంది. ఈ నియోజకవర్గంపై మంచి పట్టున్న వట్టి కుటుంబం నుంచి వట్టి పవన్ నాలుగు రోజులుగా తన కుటుంబాన్ని ఆదరించిన నాయకులను, అభిమానులను ప్రత్యక్షంగా కలుస్తున్నారు. గత బుధవారం మండలంలో అభిమానులను కలుసుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలో రాజకీయ ఉద్దండులుగా పేరొందిన వట్టి కుటుంబం నుండి మరో నేత రాజకీయాల్లోకి రంగప్రవేశం చేసేందుకు పావులు కదుపుతున్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ అధ్యక్షులుగా పని చేసిన వట్టి వెంకటరంగ పార్థసారథి పెద్ద కుమారుడు రమేష్ తనయుడు వట్టి పవన్. తన బాబాయ్ వట్టి వసంతకుమార్ రాష్ట్ర మంత్రిగా పొందిన ప్రత్యేక గుర్తింపుతో తనను నియోజకవర్గ ప్రజలు ఆదరిస్తారనే నమ్మకంతో ముందడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఉంగుటూరు నియోజకవర్గంపై వసంత్‌కుమార్ తనదైన ముద్ర వేసుకున్నారు. రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి రాజకీయాల నుండి తప్పుకున్నారు. వసంత కుమార్ తిరిగి రాజకీయాల్లోకి వస్తారంటూ గత ఎనిమిదేళ్లలో ఆడపాదడపా ప్రచారం జరిగినా స్తబ్దతగానే ఉన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో వసంత్‌కుమార్ కన్నుమూశారు. అయితే ఆయన చనిపోయిన మరో రెండు నెలలకే తండ్రి పార్థసారథి కూడా కన్నుమూశారు. ఈ నేపథ్యంలో వట్టి కుటుంబం నుండి రాజకీయాల్లోకి ఎవరూ వచ్చే అవకాశాలు లేవనుకుంటున్న సమయంలో అనూహ్యంగా వసంత్ రాజకీయ వారసునిగా వట్టి పవన్ రాజకీయ రంగప్రవేశానికి తన కుటుంబ సభ్యులతో అనుచరులను కలుస్తున్నారు. అయితే ఏ పార్టీలో చేరేది త్వరలో చెబుతానంటూ తన కుటుంబ అభిమానులు, కార్యకర్తల గౌరవాన్ని కాపాడే పార్టీలోనే చేరతానంటూ నియోజకవర్గ బాట పట్టారు.

పవన్ అడుగులు ఎటువైపో..?

వట్టి పవన్ రాజకీయాల్లోకి రావడంతో ఏ పార్టీలో చేరతారోననే చర్చ ప్రారంభమైంది. వట్టి కుటుంబం మొదటి నుండి రాజశేఖర్‌రెడ్డి కుటుంబానికి ఆప్త మిత్రులుగా ఉన్న సంగతి అందరికీ తెలిసిందే. అయితే జగన్మోహన్‌రెడ్డి తన తండ్రి మరణం తర్వాత రాష్ట్రంలో మొట్టమొదటిగా ఓదార్పు యాత్ర ఉంగుటూరు నియోజవర్గం నుండి ప్రారంభించారు. జగన్ వైసిపి స్థాపించిన తర్వాత వసంత్‌కుమార్ ఆ పార్టీలో చేరకుండా కాంగ్రెస్‌లోనే ఉండిపోయారు. అయితే ఇప్పుడు వసంత్‌కుమార్ మిత్ర బృందం వైసిపిలోనే ఉంది. వారి సూచన మేరకు పవన్ వైసిపి గూటికి చేరే అవకాశం ఉందని సన్నిహితులు చెబుతున్నారు. ఇప్పటికే రాష్ట్రస్థాయి నాయకులు, మంత్రులతో మాట్లాడి కొలిక్కి వచ్చిన తర్వాతే నియోజవర్గంలో పవన్ పర్యటిస్తున్నారని మరి కొంతమంది చెబుతున్నారు. పవన్ తన బాబాయ్ వట్టి వసంత్‌కుమార్ తరహాలోనే పవన్ కూడా ఈశాన్య గ్రామమైన వెల్లమిల్లి నుంచి అభిమానులను కలుసుకునే కార్యక్రమం చేపట్టారు. ఉంగుటూరు మండలంలో రాచూరు, దొంతవరం, సీతారామపురంలో నేతలను కలిశారు. రాచూరులో మహిళలు హారతులతో స్వాగతం పలికి తమ ఆత్మీయత చాటుకున్నారు.

మెట్ట గ్రామాల్లో పవన్ పర్యటన

వట్టి పవన్‌కుమార్ శనివారం మెట్ట ప్రాంత గ్రామాలైన గోపీనాథపట్నం, గొల్లగూడెం, కంసాలిగుంట, యర్రమిల్లిపాడు, నల్లమాడు, రామచంద్రపురం, గోపాలపురం, పందిరెడ్డిగూడెం, తిమ్మయ్యపాలెం, కొత్తగూడెం, అక్కుపల్లిగోకవరం గ్రామాల్లో కాంగ్రెస్, వైసిపి నాయకులను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయా గ్రామాల్లో కీలక, ముఖ్యనేతలను కలసి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. సోమవారం నుంచి నిడమర్రు మండలంలో పర్యటిస్తామని పవన్‌కుమార్ అనుచరులు తెలిపారు. ఆయన వెంట మాజీ జెడ్‌పిటిసి కాటి కిరణ్‌కుమార్, డిసిసిబి మాజీ డైరెక్టర్ మైలవరపు గోపాలకృష్ణ, యూత్ కాంగ్రెస్ నాయకుడు ముత్యాల బాలాజీ, మద్దాల శ్రీనివాసరావు, మంద శ్రీనివాసరెడ్డి, ఆల్డా మాజీ ఛైర్మన్ దాసరి గంగాధరరావు, గట్టిం నాని ఉన్నారు.

అత్యాచార నిందితులు అరెస్టు

మండవల్లి: బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తులను శనివారం మధ్యాహ్నం అరెస్టు చేశామని డిఎస్‌పి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలికను ఆమె తల్లిదండ్రులు గత సంవత్సరం నాలుగో తరగతిలో ఉండగానే స్థానిక హాస్టల్‌లో చేర్పించారని శ్రీనివాసులు తెలిపారు. బాలిక పెద్దమ్మ హాస్టల్ సమీపంలోనే అద్దెకు ఉండడంతో బాలిక ఆలనా పాలనా చూసుకోవాలని బాధితురాలి తల్లి కోరిందన్నారు. దీంతో బాలిక పెద్దమ్మ అప్పుడప్పుడు బాధితురాలిని తన ఇంటికి తీసుకెళ్లి అవసరమైనవి కొని ఇస్తూ ఉందని చెప్పారు. ఈ క్రమంలో బాధితురాలి పెద్దమ్మ కొడుకు మైనర్ ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో బాలికను హాస్టల్ నుండి ఇంటికి తీసుకొచ్చి అత్యాచారానికి పాల్పడేవాడని తెలిపారు. ఇదే క్రమంలో బాలికకు వరుసకు అన్నయ్యతో పాటు మరో మైనర్, అతని స్నేహితుడైన పఠాన్ ఖాదర్‌ఖాన్ కూడా బాలికను బెదిరించి సామూహిక అత్యాచారానికి పాల్పడేవారని, ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించడంతో బాధితురాలు ఆందోళనతో ఎవరికీ చెప్పలేదని వివరించారు. ఈ నెల 18న బాలికను మళ్లీ ఇంటికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా ఆమె నిరాకరించిందని, ఈ క్రమంలో విషయం వెలుగుచూసిందని తెలిపారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని, బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ముద్దాయిల కోసం గాలిస్తుండగా మండవల్లి రైల్వేస్టేషన్లో తిరుగుతున్న ఇద్దరు మైనర్లను, ఖాదర్‌ఖాన్‌ను అరెస్టు చేశామని చెప్పారు. వారిపై ఫొక్సో కేసులతో ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు నమోదు చేశామని, నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

హాస్టల్ వార్డెన్‌పై సస్పెన్షన్ వేటు

బాలిక సామూహిక అత్యాచారానికి గురైన ఘటనపై కలెక్టర్ ఆదేశాల మేరకు హాస్టల్ వార్డెన్ కె.నాగలక్ష్మిని సస్పెండ్ చేశామని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ వి.జయప్రకాష్ తెలిపారు. ఆయన శనివారం మండవల్లిలో వసతిగృహాన్ని పరిశీలించి సిబ్బందితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జెడి మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులను బయటకు వెళ్లనీయకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. తల్లిదండ్రుల ప్రమేయం లేకుండా చిన్నారులను బయటి వ్యక్తులతో అసలు పంపకూడదన్నారు రెండు నెలలుగా బాలిక ఆరోగ్య పరిస్థితి బాగోనప్పటికీ సిబ్బంది పట్టించుకోలేదని తెలిసిందన్నారు. దీనిపై వార్డెన్ నాగలక్ష్మిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు.

ఉన్నత స్థితికి విద్యే కీలకం : కలెక్టర్

ఏలూరు: ఉన్నత స్థితికి చేరేందుకు విద్య ఒక్కటే మార్గమని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. స్థానిక గాంధీనగర్ నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జగనన్న విద్యాకానుక కింద జిల్లాస్థాయిలో సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాల పంపిణీలో ఆయన పాల్గొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడమే కాకుండా విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యానికి పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు.

జగన్ పాలన అస్తవ్యస్తం : టిడిపి

బుట్టాయగూడెం: రాష్ట్రంలో జగన్ పరిపాలన అస్తవ్యస్తంగా ఉందని, అన్నివర్గాల ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని టిడిపి నియోజకవర్గం కన్వీనర్ బొరగం శ్రీనివాసులు అన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే ప్రజలకు అందించే సంక్షేమ పథకాలను వివరించి, సంబంధిత కరపత్రాలను శనివారం ఇంటింటా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పథకాల పేరు చెప్పి తన జేబులు నింపుకుంటున్నాడన్నారు. రాష్ట్రానికి చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే అభివృద్ధి, సంక్షేమం అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మొగపర్తి సొంబాబు, ఏలూరు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ యంత్రప్రగడ శ్రీనివాస్, ఎస్‌టి సెల్ రాష్ట్ర కార్యదర్శి సున్నం నాగేశ్వరరావు, తెలుగురైతు ఏలూరు జిల్లా కార్యదర్శి గద్దె అబ్బులు, ఏలూరు జిల్లా అధికార ప్రతినిధి జారం చాందినీ విద్యా సాగరిక, నియోజకవర్గం తెలుగు రైతు కార్యదర్శి కుందుల శ్రీను, నియోజకవర్గం ఎస్‌టి సెల్ అధ్యక్షులు మడకం రామకృష్ణ, కెరం వెంకటేశ్వరరావు, దెయ్యాల కృష్ణమోహన్, వరకా కృష్ణంరాజు, మిర్తివాడ సుబ్రహ్మణ్యం, మిర్తివాడ ప్రతాప్‌రెడ్డి, మడి సోమరాజు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ఏలూరు: జిల్లాలో అర్హత కలిగిన 9, 10వ తరగతి, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుచున్న బిసి, ఇబిసి, సంచార జాతుల కులాలకు చెందిన విద్యార్థులు పియం యశస్వీ ఉపకార వేతనములు పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారిణి నాగరాణి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు వచ్చే నెల ఆగష్టు 10వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2 లక్షల 50 వేలకు మించరాదన్నారు. నేషనల్ టెస్ట్ ఏజెన్సీ వారు సెప్టెంబర్ 29వ తేదీన పరీక్ష నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు https://yet.nta.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలియజేశారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అభివృద్ధి వైసిపితోనే సాధ్యం

కైకలూరు: గ్రామాల అభివృద్ధి వైసిపితోనే సాధ్యమని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు తెలిపారు. శనివారం మండలం దొడ్డిపట్లలో రూ.70 లక్షల నిధులతో ముంజూరై నిర్మించిన సీసీ డ్రైన్, సీసీ రోడ్లు, గ్రామ సచివాలయంను ప్రారంభించి శిలాఫలకం ఆవిష్కరించారు. గ్రామంలో మైక్రో ఫిల్టర్ పనులకు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం కీర్తిశేషులు ఉండి స్వామిదాసు, ఆలీసమ్మలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడవి వెంకటకృష్ణ మోహన్, సర్పంచి చెరుకువాడ బలరామరాజు, ఎంపిటిసి కరణం వెంకటలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలు చదువుకోవాలి

ముసునూరు: అవసరాల గల పిల్లలు ప్రతిఒక్కరూ చదువుకోవాలని మండల విద్యాశాఖాధికారి బివి సుబ్బారావు తెలిపారు. శనివారం మండలంలోని ముసునూరు, చింతలవల్లి, చెక్కపల్లి గ్రామాల్లో దివ్యాంగ విద్యార్థులు చదువుకునేందుకు గుర్తింపు, నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యూఎస్ఎన్ ఉపాధ్యాయులు డిఎంవి లక్ష్మినారాయణ, జె.నాగమల్లేశ్వరి, ప్రధానోపాధ్యాయులు ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఓటర్‌లిస్టు వెరిఫికేషన్‌లో పాల్గొన్న టిడిపి నాయకులు

ఓటరు లిస్టు సరిచూసుకోండి

ప్రజాశక్తి - ముసునూరు

ఓటరులిస్టులో ఎటువంటి అవకతవకలు లేకుండా సరిచూసుకోవాలని తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దే రఘుబాబు పేర్కొన్నారు. శనివారం మండలంలోని గుళ్లపల్లి శివారు గుడిపాడు గ్రామ సచివాలయం పరిధిలో ఓటరులిస్టు వెరిఫికేషన్‌లో బిఎల్‌ఒ శివ ఆధ్వర్యంలో సర్వంచి భర్త శ్రీనివాసరావు, టిడిపి కన్వీనర్ కొల్లి ప్రసాద్, సత్యనారాయణలు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: అన్ని గ్రామాలలో క్లస్టర్ ఇంఛార్జులు, యూనిట్ ఇంఛార్జులు, బూత్ ఇంఛార్జులు తప్పనిసరిగా బిఎల్‌ఒలతో పాటు ఓటర్ వెరిఫికేషన్‌లో పాల్గొనాలని టిడిపి నియోజకవర్గ పరిశీలకులు కొళ్ల నాగేశ్వరరావు అన్నారు. శనివారం మండల టిడిపి కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు సాయిల సత్యనారాయణ అధ్యక్షతన మండల పార్టీ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా చింతలపూడి నియోజకవర్గం పరిశీలకులు కొళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ వాటర్ వెరిఫికేషన్‌లో దొంగ ఓట్లు గుర్తిస్తే బిఎల్‌ఒ దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సాయిల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కుక్కల మాధవరావు, మండల రైతు అధ్యక్షులు ఎలికె ప్రసాద్, తెలుగు యువత అధ్యక్షులు గారి అనిల్, మండల పార్టీ ఉపాధ్యక్షులు పొన్నగంటి అనిల్, క్లస్టర్ ఇంఛార్జి దాసరి అప్పారావు, మాజీ జడ్పిటిసి శీలం రామచంద్రరావు పాల్గొన్నారు.

హన్న సేవలు మరువలేం..

ముసునూరు: అంగన్‌వాడీ కార్యకర్తగా ఎన్నో సేవలందించిన ఘనత కె.హన్నకే దక్కుతుందని ప్రాజెక్టు సూపర్ వైజర్ నూరాని, ఎసిడిపిఒ డి.నాగేశ్వరులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని సూరేపల్లి గ్రామం పరిధిలో అంగన్‌వాడీ సెంటర్ 137 కోడ్‌లో పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త కె.హన్న ఉద్యోగవిరమణ వేడుకలు అక్కిరెడ్డి గూడెం సెక్టార్ కె.ధనలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఘనంగా సత్కరించారు.

నేరాలు - ఘోరాలు

నకిలీ పోలీసు అరెస్టు

చింతలపూడి: చింతలపూడిలో నకిలీ పోలీసుగా చలామణి అవుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సిఐ మల్లేశ్వరావు తెలిపారు. విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం పోలీస్‌నంటూ వ్యాపారులు, ఉద్యోగులు, నాయకుల వద్ద డబ్బు వసూలు చేస్తున్న ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన రాచప్రోలు నవీన్(28)ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

డ్వాక్రా సొమ్ము కాజేసిన వ్యక్తిపై కేసు

ఆగిరిపల్లి: మండలంలోని నరసింహపాలెం, సగ్గూరు, తోటపల్లి గ్రామాలకు చెందిన డ్వాక్రా గ్రూపు సభ్యుల నుంచి నగదును వసూలు చేసి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు జమచేయవలసిన బిజినెస్ కరస్పాండెంట్ అయిన కనికెళ్ల అర్జునరావు దుర్వినియోగానికి పాల్పడినట్లు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆగిరిపల్లి బ్రాంచి మేనేజర్ మిరియాల జగన్మోహనరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నరసింహపాలెం గ్రామంలో 35 డ్వాక్రా గ్రూపులకు సంబంధించి, రూ.76 లక్షల 43 వేల 775లు, పసుపులేటి స్నేహితులు గ్రూపుకు సగ్గూరు గ్రామానికి చెందిన 23 డ్వాక్రా గ్రూపులకు సంబంధించి, రూ.30 లక్షల 21 వేల 420లు, గోళ్ల జయచంద్ర తోటపల్లి గ్రామానికి చెందిన 10 డ్వాక్రా గ్రూపులకు సంబంధించి, రూ.2 లక్షల 28 వేల 100లు నిధులను డ్వాక్రా గ్రూపు సభ్యుల నుంచి వసూలు చేసి బ్యాంక్‌లో జమచేయకుండా దుర్వినియోగానికి పాల్పడ్డారు. డ్వాక్రా గ్రూపు మహిళలకు మోసం చేసినట్లుగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగిందని ఆగిరిపల్లి ఎస్ఐ ఎ.చంటిబాబు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని బత్తులవారి గూడెంలో భార్య మౌనిక(32) మానసిక వేదనకు గురై శనివారం గుళికలు సేవించి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. భర్త కొండ వేధింపులే కారణమని బాధితురాలు పేర్కొంది. సమీపంలో వారు గమనించి 108కు సమాచారం అందించారు. బాధితురాలిని నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మణిపూర్ హింసాకాండను ప్రోత్సహిస్తున్న బిజెపి: డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఓట్లు, సీట్లు కోసం కుల మతాల మధ్య చిచ్చుపెట్టి మణిపూర్ హింసాకాండను ప్రోత్సహిస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి జి.సూర్య కిరణ్ అన్నారు. శనివారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో డివైఎఫ్ఐ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కమిటీ సభ్యులు బి.కిషోర్ అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి జి.సూర్య కిరణ్ మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళల పట్ల అసాంఘిక శక్తులు చేసిన దుశ్చర్య సంఘటన యావత్ ప్రజానీకం సిగ్గుపడాలని తెలిపారు. దేశంలో రోజు రోజుకి మహిళలకు రక్షణ కరువైందన్నారు. మణిపూర్‌లో అల్లర్లు, ఇతర ఘటనలు విపరీతంగా జరగడం దారుణమనీ విమర్శించారు. అల్లర్లలో చాలా మంది చనిపోయారనీ, అది మరవక ముందే ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి సామూహిక అత్యాచారానికి పాల్పడిన సంఘటన ఘోరమైందన్నారు. రోమ్ నగరం తగలబడుతుంటే నిరో చక్రవర్తి ఫిడేలు వాయించినట్లు మణిపూర్ తగలబడి పోతుంటే మోడీ మౌన నిద్రలో వుండటం సరికాదన్నారు. కేంద్ర మంత్రులు కనీసం స్పందించకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. మణిపూర్ సంఘటన యావత్ ప్రజానీకం ఖండించి బాధితులకు న్యాయం జరిగేంతవరకూ వివిధ దశల్లో నిరసన కార్యక్రమాలు చెయ్యాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో బిజెపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు రాజేష్, వి.వెంకట్, ఎన్.సాగర్ పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' సేవలను వినియోగించుకోవాలి

అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉంగుటూరు ఎంఎల్ఎ

ప్రజాశక్తి - భీమడోలు

జగనన్న సురక్ష సేవలను వినియోగించుకోవాలని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు కోరారు. మండలంలో శనివారం ఆయన పర్యటించారు. పర్యటనలో భాగంగా తొలుత కురెళ్లగూడెం గ్రామపంచాయతీలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, అంబరుపేటలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాలను ప్రారంభించారు. పాత అంబరుపేట గ్రామ కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ స్థానిక పంచాయతీ అభివృద్ధికి వివిధ పథకాల కింద సుమారు రూ.10 కోట్లు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి తుమ్మగుంట భవాని, ఎంపిపి కనుమాల రామయ్య, ఆయా గ్రామ పంచాయతీలకు చెందిన సర్పంచిలు, ఎంపిటిసిలు భీమడోలు సొసైటీ అధ్యక్షులు రావిపాటి సత్య శ్రీనివాస్, కో ఆప్షన్ ఎంపిటిసి సభ్యులు సయ్యద్ ఆజం సాహెబ్, ఎఎంసి ఛైర్‌పర్సన్ ఇంజేటి నీలిమ జూనియర్, రామకుర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పోలవరం: మండలంలోని కొండ్రుకోట గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం సర్పంచి నాగరాజు ఆధ్వర్యంలో ఎంపిపిల సంఘం జిల్లా అధ్యక్షులు పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, ఎంపిడిఒ జి.శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను ఎంపిపికి తెలియజేయగా వాటిని త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులకు తెలియజేశారు. అనంతరం సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందజేశారు. ప్రజలందరూ జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ముదినేపల్లి: జగనన్న సురక్షతో ప్రజలకు సత్వరమే ధృవీకరణ పత్రాలు అందుతున్నాయని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని వైవాక గ్రామ సచివాలయం వద్ద శనివారం జగనన్న సురక్ష గ్రామసభను అధికారులు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఎల్ఎ డిఎన్ఆర్ మాట్లాడుతూ దేశ చరిత్రలోనే సచివాలయ వ్యవస్థ చిరస్థాయిగా నిలుస్తుందన్నారు. అనంతరం కార్యక్రమానికి గుర్తుగా సచివాలయ వద్ద మొక్కను నాటారు. గ్రామ సర్పంచి నున్న పద్మావతి అధ్యక్షతన జరిగిన ఈసభలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, గంటాసంధ్య, వైస్ ఎంపిపి రాచూరి రాధా, మండల పార్టీ కన్వీనర్ ఎం.ఏసుబాబు, తహాశీల్దార్ కె.శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రమేష్, ఎంపిటిసి బోయిన నాగరాజు, నాయకులు గంటా కోటేశ్వరరావు, నగుళ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: మండలంలోని తుక్కులూరు గ్రామంలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్షలో ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు ముఖ్యఅతిథిగా పాల్గొని అర్హులకు ధృవపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ టిడిపి నాయకులు చెప్పే మాయమాటలు నమ్మొద్దని అన్నారు. జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని ఆయన పథకాలే అందుకు నిదర్శనమన్నారు.

12, 13 తేదీల్లో గ్రామీణ క్రీడల గ్రామోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు

ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామీణ క్రీడల గ్రామోత్సవం నిర్వహణలో భాగంగా సంస్థ నిర్వాహకులు జిల్లా కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేష్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శనివారం ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఆగస్టు 12, 13 తేదీల్లో జంగారెడ్డిగూడెంలోని సిఎస్, టిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో వాలీబాల్(పురుషులకు), త్రోబాల్(స్త్రీలకు) జిల్లా స్థాయిలో మ్యాచ్‌లను జిల్లా స్పోర్ట్స్ అథారిటీ వారి సహకారంతో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వికాస్, పిఎస్ఆర్ చరణ్‌లు, జిల్లా కలెక్టర్‌కు వివరించారు. విజేతలు కేలో ఇండియా సర్టిఫికెట్, ప్రైజ్ మనీని అందుకుంటారన్నారు. జట్టు సభ్యులందరూ ఒకే గ్రామ పంచాయతీకి చెందినవారై ఉండటం ఈ కార్యక్రమం ప్రాముఖ్యత అన్నారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి, ఇతర వివరాలకు htpp:/isha.co/gramotsavam, లేదా 8300030999, 8050453299 నెంబర్లకు సంప్రదించవచ్చన్నారు.

ఓటర్ల జాబితాను పరిశీలించిన కలెక్టర్ వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేష్ బూత్ లెవల్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని బావిశెట్టివారి పేట నల్లదిబ్బ ప్రాంతములో 21వ తేది నుంచి ప్రారంభించిన బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికి వెళ్లి ఓటర్ల లిస్ట్ స్వచ్ఛీకరణ చేసే కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. బూత్ లెవెల్ అధికారులను ఉద్దేశించి, ఇంటింటికి వెళ్లి ఓటర్ల లిస్ట్ స్వచ్ఛీకరణ చేసే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ముఖ్యంగా ఒకే ఇంటిలో పదిమంది ఓటర్లు ఉన్నట్లయితే అటువంటి ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ప్రతిపాదించిన బూత్ లెవల్ ఏజెంట్లను అనుమతించాలన్నారు. సర్వేకి వెళ్లినప్పుడు 18 సంవత్సరములు నిండిన వారు ఆ ఇంట్లో ఉన్నట్లయితే వారిని ఓటరుగా నమోదు చేయాలని, ఓటు ఉన్న వ్యక్తి మరణించి ఉంటే వారి ఓటును ఓటర్ లిస్ట్ నుండి తొలగించాలన్నారు. ఓటు నమోదులో పేర్లు, లింగము, చిరునామా తప్పులు లేకుండా ఒకటికి రెండుసార్లు సరి చూసుకోవాలన్నారు. వాస్తవానికి సంబంధిత ఓటర్లు ఆ ఇంట్లో లేకపోతే ఫారం 8 ద్వారా తొలగించాలని, ఒకవేళ వారు వేరే ఇంటికి మారినట్లయితే వారి చిరునామా మార్పు చేయాలని జిల్లా కలెక్టర్ వారు బూత్ లెవెల్ అధికారులను ఆదేశించారు. 18 సంవత్సరాల వయసు లోపు కలిగిన వారు ఎట్టి పరిస్థితుల్లో ఓటర్‌గా నమోదు కాకూడదని సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమములో వాలంటీర్ల సేవలను ఉపయోగించరాదన్నారు. వాలంటీర్ల సేవలను వినియోగించినచో అట్టి బూత్ లెవల్ అధికారులపై, వాలంటీర్లపై ప్రభుత్వ నిబంధనల ప్రకారము క్రమ శిక్షణా చర్యలు తీసుకొనబడతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఓటర్ల నమోదు అధికారి ఇఆర్ఒ జెడ్‌పి ముఖ్య కార్యనిర్వహణాధికారి, కెవిఎస్ఆర్ రవి కుమార్, నగరపాలక సంస్థ కమీషనరు ఎస్.వెంకట కృష్ణ, ఎఇఆర్ఒ, ఏలూరు తహాశీల్దార్, బి.సోమశేఖర్ పాల్గొన్నారు.

అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తూ..

మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలి

ఉంగుటూరు: దేశ విముక్తి కోసం స్వతంత్ర పోరాటంలో ప్రాణాలర్పించిన అల్లూరి సీతారామరాజు అందరికి ఆదర్శమని మానవతా పూర్వ జిల్లా అధ్యక్షులు సాగిరాజ జానకి రామరాజు అన్నారు. మహనీయుల ఆశయాల ప్రచార కమిటీ పేరుతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నిర్వహించిన సభకు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ బివి శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ టికె విశ్వేశ్వరరావు, చేబ్రోలు ఉర్దూ యూపి స్కూల్‌లో ఇంఛార్జి హెడ్ మాస్టర్ బాషా, నారాయణపురం హై స్కూల్‌లో ఇంఛార్జి హెడ్ మాస్టర్ సుధీర్ అధ్యక్షత వహించారు. అన్ని సభలలో ముందుగా మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహనీయుల ఆశయాల ప్రచార కమిటీ ఉంగుటూరు మండల కమిటీ తరపున పొత్తూరి శ్రీనివాసరాజు సౌజన్యంతో అల్లూరి సీతారామరాజు చిత్ర పటాలు అందజేశారు. శాగిరాజు జానకి రామ రాజు మాట్లాడుతూ అల్లూరి, భగత్‌సింగ్, గాంధీ, ఝూన్సి వంటి వారి జీవితాల్లోని త్యాగాలు విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. ప్రధాన వక్తగా పాల్గొన్న ఏలూరు ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ మహనీయుల కృషి, ఆదర్శాలు, చూపిన మార్గంలో పయనించి దేశాన్ని, సమాజాన్ని బాగు చేయడానికి భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు.

నూతన ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవం

కలిదిండి: తాడినాడలో రూ.1.09 కోట్లతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్ నూతన భవనాలను కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు ప్రారంభించారు. ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, జెడ్‌పిటిసి బొర్రా సత్యవతి, వైస్ ఎంపిపి కూసంపూడి కనకదుర్గారాణి, ఎఎంసి ఉపాధ్యక్షులు పాము రవికుమార్, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎంఐజి ప్లాట్‌లకు ఆన్‌లైన్ దరఖాస్తులు

నూజివీడు రూరల్: పట్టణంలోని ఎంఆర్ అప్పారావు కాలనీ సమీపంలో మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఎంఐజి లేఅవుట్ ప్లాట్‌లకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని మున్సిపల్ కమీషనర్ అబ్దుల్ రషీద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ గజం రూ.8,500గా నిర్ణయించి 150, 200, 240 గజాల ప్లాట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఆగస్టు 19వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

టిటిడికి 12 టన్నులు కూరగాయలు వితరణ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని వెంకటేశ్వర స్వామి కోవెల వద్ద నుంచి తిరుమల తిరుపతి దేవస్థానంలో భక్తులకు నిత్యాన్నదానం నిమిత్తం 12 టన్నుల కూరగాయలను శనివారం ప్రత్యేక వాహనంలో పంపించారు. ఈ సందర్భంగా రైతులు పామర్తి వెంకట శ్రీహరి, మడుపల్లి మధురవిశంకర్, సాయి, ఆంజనేయులు మాట్లాడుతూ ఐదవ సారి రైతులందరి సహకారంతో కూరగాయలు పంపుతున్నట్లు తెలిపారు. ప్రత్యేక వాహనాన్ని పంపిన టిటిడి బోర్డు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

క్లెయిముల పరిష్కారానికి ప్రత్యేక లోక్‌అదాలత్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లా వ్యాప్తంగా వాహన ప్రమాద క్లైములు, భూ పరిహార క్లైములు పరిష్కారం నిమిత్తం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని ఫోక్సో ప్రత్యేక కోర్ట్ స్పెషల్ జడ్జి ఎస్.ఉమా సునంద తెలియజేశారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనమునందు కక్షిదారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదా అవుతాయని, కక్షిదారులందరూ ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి ఎం.రామకృష్ణంరాజు, ఎం.సునీల్ కుమార్ పాల్గొన్నారు.

108 యూనియన్ జిల్లా అధ్యక్షునిగా ప్రసాద్ ఎన్నిక

ఉంగుటూరు: 108 ఎంప్లాయిస్ యూనియన్ ఏలూరు జిల్లా ప్రెసిడెంట్‌గా ఉంగుటూరు మండలం రావులపర్రు గ్రామానికి చెందిన ఇబ్బా ప్రసాద్ ఎంపికయ్యారు. శనివారం ఏలూరులో జిల్లా 108 ఉద్యోగుల కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. 108 ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు. ప్రసాద్‌ను ఉంగుటూరు 108 సిబ్బంది, సిఐటియు నాయకులు అభినందించారు.

గిరిజన, గురుకుల పాఠశాలల పరిశీలన

టి.నరసాపురం: మర్రిగూడెం ప్రభుత్వ ఆశ్రమ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల, అప్పలరాజుగూడెం బాలుర గురుకుల పాఠశాలలను జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు శనివారం ఎస్ఐ కె.సతీష్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు విద్యార్థులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల భద్రతకు రెండు పాఠశాలల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని వారు కోరారని తెలిపారు.సమస్యలు ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు. ఆయన వెంట కానిస్టేబుల్ రమేష్ ఉన్నారు.

అర్హులైన క్రీడాకారులు పాల్గొనాలి

నూజివీడు రూరల్: ఆడుదాం ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో ఆసక్తి కలిగిన అర్హులైన క్రీడాకారులు పాల్గొనాలని డివైఇఒ సేవ్య అన్నారు. ఎస్ఆర్ఆర్ బాయ్స్ హై స్కూల్‌లో నిర్వహించిన సమావేశంలో శనివారం ఆయన మాట్లాడుతూ కబడ్డీ, కోకో, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ ఆటల పోటీలలో 17 ఏళ్లు నిండిన బాల, బాలికలు పాల్గొనవచ్చునని తెలిపారు. గ్రామ, మండల స్థాయి నుంచి నియోజకవర్గస్థాయిలో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

MUNICIPAL CORPORATION, ELURU

e-PROCUREMENT TENDER NOTICE No. 183-191/15th FC, GGMP-Mpl Funds & General /2023-24, Dated: 21-07-2023

The Commissioner, Municipal Corporation, Eluru, invites tenders from interested, eligible bidders for **"Supply and Delivery of JCB 30, Supply of Skid Steer Loader, CC Roads, Repairs to various bridges, Repairs to potholes & Providing High Mast Poles in Municipal Corporation, Eluru"** Total No of works is 9 with an amount of **Rs.210.65 Lakhs.**

Tender schedules are available on e-procurement market place from 24-07-2023. Last date of receipt of tenders is 28-07-2023. Further details can be seen at e-procurement market place at **www.apeprocurement.gov.in** or contact Commissioner Municipal Corporation, Eluru, Eluru District (Phone / Fax : 08812 - 245990)

Sd/- **COMMISSIONER,** Municipal Corporation, Eluru

CHANGE OF NAME

I, KASUKURTHI MADHU LATHA W/o.VEDURU KESAVA SAIRAM, D.No.25-1/1-24, Islam Peta, Pathebada, Near Vedharaj Theatre, Eluru, Eluru Dist, A.P-534002. Have Changed My Surname from **KASUKURTHI MADHU LATHA (Old Name) To VEDURU MADHU LATHA (New Name)** hence forth I am being called as **VEDURU MADHU LATHA (NEW NAME)** for all practical purposes.

పాస్‌పోర్టు పోయినది

ప॥గో॥జిల్లా, గణపవరం మండలం, ముగ్గళ్ళ గ్రామనికి చెందిన గేడి సాయిలక్ష్మి, భర్త: గేడి శ్రీనివాస్ అనునా యొక్క **పాస్‌పోర్టు నెంబర్ L1623903** ముగ్గళ్ళ గ్రామం నుండి గణపవరం ఆటోలో వస్తుండగా మార్గమధ్యలో పడిపోయినది. దొరికిన వారు ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

గేడి సాయిలక్ష్మి
భర్త గేడి శ్రీనివాస్, ముగ్గళ్ళ,
గణపవరం మండలం, ప॥గో॥ జిల్లా.
సెల్: 79953 08066

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P.No. 34/2022
in O.S.No. 160/2014

Petitioner /D.H.R.:
కొప్పాడ రాజశేఖర్
Respondent /J.D.R.:
బోణమ్ మురళీ కృష్ణ ఆంజనేయులు
J.D.R. /Respondent Address:
బోణమ్ మురళీ కృష్ణ ఆంజనేయులు, తండ్రి: వెంకట సత్యనారాయణ, డో.నెం. 2-1, కోమటి గుంట, H/o. కోలనపల్లి, కాళ్ళ మండలం, ప॥గో॥జిల్లా. ఎ.పి.

పై నెంబరు పిటీషనులో పిటీషనరు / డి.హెచ్.ఆర్. మీకు నోటీసులను కోర్టు మరియు పోస్టు ద్వారా ఎన్నిసార్లు పంపినా మీరు తీసుకొనక Avoid చేయుచున్నందున, మీరు **ది.11-08-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని మీ ఆక్షేపణలు తెలియ జేసుకోవలెను.** లేని ఎడల పై పిటీషను పై కోర్టు వారు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

B.ANDREWS
పిటీషనరు తరుపు అడ్వకేట్,
భీమవరం, భీమవరం.
22-7-23. సెల్: 92908 42975

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No. 1087/2022
in O.S.No. 354/2014

Petitioner: Kattta Satyavathi @ Satya Krishna & Another
VS
Respondent:
Oggu Naga Suresh Babu & 6 Others
Respondent Address:
ఆకురాతి హసనశ్రీ, భర్త: గంటి రవితేజ, డో.నెం. 2-38-1ఎ, ధ్వజస్థంబం వీధి, తణుకు, ప॥గో॥జిల్లా, ఎ.పి.

పై నెంబరు పిటీషనులో పిటీషనరు మీకు నోటీసులను కోర్టు మరియు పోస్టు ద్వారా ఎన్నిసార్లు పంపినా మీరు తీసుకొనక Avoid చేయుచున్నందున, మీరు **ది.27-07-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని మీ ఆక్షేపణలు తెలియ జేసుకోవలెను.** లేని ఎడల పై పిటీషను పై కోర్టు వారు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

SIMHACHALAM PASTULA (SIVA)
పిటీషనరు తరుపు అడ్వకేట్,
భీమవరం, భీమవరం.
22-7-23. సెల్: 93971 51099

రెండు కోట్లు ఇవ్వకపోతే చంపేస్తాం..!

కైకలూరు: ప్రముఖ చేపల వ్యాపారికి గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి రెండు కోట్లు ఇవ్వాలని లేకుంటే అతనిని, కుమారుడిని చంపేస్తానని బెదిరించినట్లు ఐవికెవి ప్రసాదరాజు ఆలియాస్ వజ్రంరాజు తెలిపారు. దీంతో ఆయన పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు ఎస్‌పి మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు విచారణ చేపట్టారు. చావలపాడుకు చెందిన తోకల ఏసేపు, మాణిక్యాలరావులు గతంలో వజ్రంరాజు వద్ద డ్రైవర్లుగా పనిచేశారు. వీరికి చిన్నం బారంబాసు తోడవగా హైదరాబాదులో ఉంటున్న మాణిక్యాలరావు స్నేహితుడు హేమంత్ కుమార్‌తో కలిసి పథకం రచించారు. మేము కామ్రేడ్స్‌మని మాకు రూ.2 కోట్లు ఇవ్వాలని పలుమార్లు బెదిరించారు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టగా వజ్రంరాజు ఇంటి సమీపంలో శుక్రవారం రాత్రి రెక్కీ నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాదులో ఉంటున్న హేమంత్ కుమార్‌ను కూడ అదుపులోకి తీసుకుని జైలుకు పంపించారు. తక్కువ సమయంలోనే కేసును చేదించిన పోలీస్ సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

డంపింగ్ యార్డ్ నిర్మాణ స్థలాన్ని కాపాడాలి

జీలుగుమిల్లి: గత కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిన డంపింగ్ యార్డ్ నిర్మాణ స్థలాన్ని కాపాడాలని మాజీ ఉప సర్పంచి సిపిఎం నాయకులు నేలటూరి అప్పారావు శనివారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకవర్గంలో ప్రభుత్వ పోరంబోకు స్థలంలో డంపింగ్‌యార్డ్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. డంపింగ్ యార్డ్ నిర్మాణానికి కేటాయించిన భూమిని మరలా రీ సర్వే చేసి దానికి హద్దులు వేయాలని డిమాండ్ చేశారు.

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No. 1088/2022
in O.S.No. 354/2014

Petitioner: Kattta Satyavathi @ Satya Krishna & Another
VS
Respondent:
Oggu Naga Suresh Babu & 6 Others
Respondent Address:
ఆకురాతి హసనశ్రీ, భర్త: గంటి రవితేజ, డో.నెం. 2-38-1ఎ, ధ్వజస్థంబం వీధి, తణుకు, ప॥గో॥జిల్లా, ఎ.పి.

పై నెంబరు పిటీషనులో పిటీషనరు మీకు నోటీసులను కోర్టు మరియు పోస్టు ద్వారా ఎన్నిసార్లు పంపినా మీరు తీసుకొనక Avoid చేయుచున్నందున, మీరు **ది.27-07-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని మీ ఆక్షేపణలు తెలియ జేసుకోవలెను.** లేని ఎడల పై పిటీషను పై కోర్టు వారు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

SIMHACHALAM PASTULA (SIVA)
పిటీషనరు తరుపు అడ్వకేట్,
భీమవరం, భీమవరం.
22-7-23. సెల్: 93971 51099

మహారాజశ్రీ భీమవరం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.No. 1086/2022
in O.S.No. 354/2014

Petitioner: Kattta Satyavathi @ Satya Krishna & Another
VS
Respondent:
Oggu Naga Suresh Babu & 6 Others
Respondent Address:
ఆకురాతి హసనశ్రీ, భర్త: గంటి రవితేజ, డో.నెం. 2-38-1ఎ, ధ్వజస్థంబం వీధి, తణుకు, ప॥గో॥జిల్లా, ఎ.పి.

పై నెంబరు పిటీషనులో పిటీషనరు మీకు నోటీసులను కోర్టు మరియు పోస్టు ద్వారా ఎన్నిసార్లు పంపినా మీరు తీసుకొనక Avoid చేయుచున్నందున, మీరు **ది.27-07-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని మీ ఆక్షేపణలు తెలియ జేసుకోవలెను.** లేని ఎడల పై పిటీషను పై కోర్టు వారు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

SIMHACHALAM PASTULA (SIVA)
పిటీషనరు తరుపు అడ్వకేట్,
భీమవరం, భీమవరం.
22-7-23. సెల్: 93971 51099

బహిరంగ ప్రకటన

ఈ ప్రకటన మూలముగా యావన్మందికీ తెలియజేయునది ఏమనగా నా క్లయింటు అయిన **యనమదల మహిత** గారు ది.06-06-2022 సం॥రం తేదీన ఏలూరు నగరం, పవర్‌పేట, టి.యస్.నెం. 627రు దాఖలా చ॥గ॥139-86లు స్థలము, డో.నెం. 22బి-5-25రు, అసెస్‌మెంటు నెం. 1075022858రు దాఖలా ఆర్.సి.సి. డాబా బిల్డింగును వారి తండ్రి గారైన **యనమదల గాంధీ గారి నుండి దఖలు పొంది ఏలూరు ఆర్.ఓ.లో దస్తావేజు నెం. 6758/2022రుగా రిజిష్ట్రీ పొందియున్నారు.** సదరు ఆస్థికి సంబంధించి నటువంటి ఒరిజినల్ దస్తావేజు యొక్క లింకు దస్తావేజును జిరాక్సు తీయించుకొను నిమిత్తం సత్రంపాడు నుండి ఏలూరులోని కోర్టు సెంటరుకు వెళ్ళుచుండగా మార్గమధ్యలో అనగా క్రొత్త బస్‌స్టాండు మధ్యలో సదరు **ఒరిజినల్ లింకు దస్తావేజు నెం. 3611/1980రు ఎచ్చటనో పడిపోయినది.** సదరు దస్తావేజు గురించి నా క్లయింటు ఎంత వెతికిననూ దొరికియుండలేదు. సదరు దస్తావేజు దొరికిన ఎడల ఈ క్రింది అడ్రసు గల వారికి తెలియజేయవలసినదిగా కోరడమైనది. సదరు పైన తెలిపిన ఒరిజినల్ దస్తావేజు మరియు ఒరిజినల్ లింకు దస్తావేజునకు సంబంధించిన ఆస్థిపై ఋణము మంజూరు చేయుటకు గాను, బ్యాంకు సంబంధిత కార్యకలాపాలు, వ్యవహారములు యందు ఎవరికైననూ ఎటువంటి అభ్యంతరములు, ఆక్షేపణలు, క్లయిములు ఉన్న ఎడల సదరు బ్యాంకు వారికి గాని, ఈ క్రింది అడ్రసు గల వారికి గాని వ్రాతపూర్వకముగా రిజిష్టరు పోస్టు ద్వారా ఈ ప్రకటన తేదీ నుండి 7 రోజులలోగా తెలియపర్చవలెను. లేనిచో సదరు విషయములో ఎటువంటి ఆక్షేపణలు లేని నిర్వివాదమైన నిష్కేచ్చి గల ఆస్థిగా భావించి బ్యాంకు వారు ఋణమును మంజూరు చేయుదురు. సదరు గడువు తదుపరి వచ్చు ఆక్షేపణలు గాని, అభ్యంతరములు గాని బ్యాంకు వారు పరిగణనలోనికి తీసుకొనరనియు మరియు అట్టివి ఏమియూ బ్యాంకు వారిని బైండు చేయజాలవని తెలియపర్చడమైనది.

ఎస్.రంగారావు
ఏలూరు, అడ్వకేట్, సత్రంపాడు,
21-7-23. ఏలూరు. సెల్: 98669 98949